క్లుప్తంగా

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తుల రాకతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహా మంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో ఆలంకరించారు. మొక్కు చెల్లించుకోవడంలో భాగంగా కొందరు భక్తులు క్షేత్ర పరిసరాల్లో పిండి వంటలు వండి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం ఓ భక్తుడు రూ.1,00,011 విరాళంగా అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. క్రిష్ణగిరి మండలం కంబలపాడు గ్రామానికి చెందిన సద్దాల లక్ష్మయ్య అండ్ సన్స్ రూ.1,00,011 దేవాలయ కార్యాలయంలో అందజేశారన్నారు. అలాగే క్షేత్రంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి గుంతకల్ పట్టణానికి చెందిన వీరేశ్ కుమార్ రూ.50వేల విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి ప్రసాదం, పూలమాల, స్వామి వారి శేషవస్త్రాలు, బాండు అందజేశారు. ప్రధాన అర్చకుడు ఈరప్పస్వామి, నాగరాజ్‌స్వామి పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు విరాళం



నగదు అందజేస్తున్న నాయకులు

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు సోమవారం వై.సీతారామిరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని రూ.25 వేల నగదును వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య ఆధ్వర్యంలో జనార్దన్‌రెడ్డి వాల్మీకి నాయకులకు అందజేశారు. వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, నాయకులు వెంకటరెడ్డి, వీకేసీ రఘు ఉన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

ఆదోని టౌన్: మున్సిపాలిటీలోని 5, 6 వార్డుల పరిధిలోని రాంజల రోడ్డులో సోమవారం పైపులైన్ల నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. పాత పైపులైన్లు పగిలిపోయి లీకేజీలు ఎక్కువగా కావడం వల్ల వాటి స్థానంలో కొత్తగా పైపులైన్లు, లింకు కనెక్షన్ల పనులు జరుగుతున్నాయి. అలాగే శిరుగుప్ప చెక్‌పోస్టు సమీపంలోనున్న కాంపోస్టుయార్డును తనిఖీ చేసి వర్మీ కంపోస్టు ఎరువును పరిశీలించారు.

జాతీయ స్థాయిలో మెరిసిన విద్యార్థినులు



కాంస్య పతకాలతో బాలికలు

కోసిగి: మండలంలోని వందగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లంక సుజాత, తుంబిగనూరు హేసేనమ్మ జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో మూడవ స్థానం కైవసం చేసుకుని కాంస్య పతకాలు దక్కించుకున్నారని ఎంఈఓ మొయినుద్దీన్, హెచ్‌ఎం యోగలింగమూర్తి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ గతనెల 8న నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఆంధ్రప్రదేశ్ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రతిభ కనపరిచి ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ జట్టుకు ఎంపికయ్యారు. అలాగే మార్చి 28, 29, 30 తేదీల్లో చత్తీస్‌గఢ్ రాష్ట్రం భిలాయిలో జరిగిన 30వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ త్రోబాల్ పోటీల్లో రాష్ట్ర జట్టులో పాల్గొన్నారు. సెమీ ఫైనల్‌కు చేరుకుని హర్యానా జట్టు చేతిలో ఓడిపోయి మూడో స్థానంలో నిలిచారు. వారిని, శిక్షణ ఇచ్చిన పీఈటీ చెన్నయ్యను అభినందించారు.

➡ చిత్తూరు జిల్లా మెలకలచెరువు మండలానికి చెందిన నారాయణమ్మకు ఆనందరెడ్డి ఒకడే కుమారు డు. ఆమె పేరు మీదనున్న రెండున్నర ఎకరాలు మాగాణి, ఒక ఎకరా మెట్టలో పైపులు వేయాలనే పేరుతో సంతకం చేయించుకొని ఆస్తి రాయించుకున్నాడు. తల్లిని పట్టించుకోకుండా సూటిపోటి మాటలతో బాధపెట్టడం ప్రారంభించారు. పోలీసులను ఆశ్రయిస్తే ఒక్కగానొక్క కొడుకు ఇబ్బందులు పడతాడని, తన మర్యాద పోతుందని మిన్నకుండిపోయింది. వేధింపులు తాళలేక ఇంటి నుంచి బయలుదేరి రైలు నుంచి దూకి చావాలని ప్రయత్నించింది. దూశే సమయంలో ఆదోనికి చెందిన ఓ వ్యక్తి కాపాడి ఆదోనిలోని జీవనజ్యోతి ఆశ్రమంలో చేర్పించారు. ప్రస్తుతం తనకు వచ్చే పింఛన్ సొమ్మును ఆశ్రమానికి అందజేస్తోంది. ఇప్పటి వరకు కన్న కొడుకు కనీసం తన గురించి ఆరా తీయకపోవడం, చూడటానికి రాకపోవడంపై కన్నీటి పర్యంతమవుతోంది.



➡ ఆదోని పట్టణానికి చెందిన హుసేన్‌కి ఒక్కగానొక్క కుమారుడు. బేల్దారి పని చేసుకుంటూ భార్య, కొడుకును పోషించాడు. కుమారుడికి పెళ్లి చేశాడు. భార్య పాడిని నమ్ముకొని పాలమ్ముతూ జీవనం సాగిస్తోంది. కొద్ది రోజులకు హుసేనికి కాలు పనిచేయడం మానేసింది. ఈ క్రమంలో కుమారుడు, కోడలు సూటి పోటి మాటలతో అన్నం పెట్టకుండా వేధించసాగారు. చివరకు ఇంటి నుంచి బయటకు వచ్చి జీవనజ్యోతి ఆశ్రమంలో చేరాడు. భార్య బర్రెల పాలు అమ్మి డబ్బులు ఇస్తుండటంతో ఆమెను ఇంట్లోనే ఉంచుకున్నారని, తన నుంచి సంపాదన లేకపోవడంతో గెంటేశారని వాపోతున్నాడు.

➡ ఆదోని మండలంలోని అలనందగుత్తి గ్రామానికి చెందిన ఓబుళ్‌రెడ్డికి ఇద్దరు కుమారులు. కుమారుల చదువు కోసం ఐదు ఎకరాల పొలం అమ్మాడు. బాగా చదివించాడు. మధ్యలో ఆయన రెండు కళ్లు పోయాయి. కళ్లు లేకపోవడంతో కుమారులు నిర్లక్ష్యం చేశారు. కళ్లకు చికిత్స చేయించాల్సి వస్తుందని కుటుంబ సభ్యులు ఓబుళ్‌రెడ్డితో మాట్లాడడం మానేశారు. ఇది గ్రహించిన ఓబుళ్‌రెడ్డి ఆస్పరి రహదారిలోని జీవనజ్యోతి ఆశ్రమంలో చేరాడు. ప్రస్తుతం ఆయన భార్య, ఇద్దరు కుమారులు, ఒక కోడలు బెంగళూరులో ఉంటున్నారు.

అందరూ ఉన్నా అనాథలు

ప్రేమకు ప్రతిరూపాలు తల్లిదండ్రులు.. గారాబంగా, ప్రేమగా పెంచుకున్న కుమారులు చెప్పుడు మాటలు విని, ఆస్తి కోసం వారిని ఇబ్బందులు పెడుతున్నారు. చివరికి వారి పేరుతో ఉన్న వాటిని రాయించుకొని రోడ్డున పడేస్తున్నారు. అయినా.. వారు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించకుండా బలవన్మరణాలకు పాల్పడుతుండగా, మరికొందరు వృద్ధాశ్రమాల్లో చేరుతున్నారు. మలిదశలో కన్నబిడ్డల ఆదరణ కరువవడంతో మౌనంగా రోదిస్తున్నారు.

- ఆస్తి రాయించుకొని గెంటేస్తున్న పుత్రరత్నాలు
- మలిదశలో కన్నబిడ్డల ఆదరణ కరువు
- వారిపై ప్రేమతో పోలీసులను ఆశ్రయించని కనిపించే దైవాలు
- కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్న వైనం
- మరికొందరు.. వృద్ధాశ్రమాల్లో, ఇంకొందరు.. భిక్షాటన చేస్తూ జీవనం



ఆదోనిలోని జీవనజ్యోతి ఆశ్రమంలో వృద్ధులు

ఆదోని అర్బన్: ఇవి మచ్చుకు కొన్నే.. ఎన్నో సమస్యలతో కన్నబిడ్డలను ప్రయోజకులుగా తీర్చిదిద్దితే.. వయస్సు మీరిందని, బాగోగులు చూడాల్సి వస్తుందని, ఆస్తి దక్కిన తరువాత నిర్లక్ష్యంగా రోడ్డుపైకి తోసేస్తున్నారు. అయినా తమ పిల్లలపై ప్రేమ చావక, వారిని ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక, తినడానికి ముద్ద దొరికితే చాలని ఎక్కడో ఒక చోట తలదాచుకుంటూ బిడ్డలను తలుచుకుంటూ మలిదశను దాటేస్తున్నారు. తల్లిదండ్రులు.. కనిపించే ప్రత్యక్ష దైవాలు. నవమాసాలు మోసి ప్రాణాలు పణంగా పెట్టి జన్మనిచ్చినా.. ఆ బాధలను భరిస్తూ బిడ్డను చూసి ముసిముసి నవ్వులు నవ్వుతుంది తల్లి. బిడ్డ నవ్వులకు మురిసిపోతూ బుడిబుడి అడుగుల్లో సంతోషం వెతుక్కుంటూ కంటికి రెప్పలా కాపాడుకునే తండ్రి. రక్తం పంచిన వీరిద్దరిని మించిన బంధం మరొకటి ఉండదు. కష్టం వచ్చినా.. నష్టం వచ్చినా కడుపులో దాచుకునేది వారే. అలాంటిది.. రెక్కలొచ్చిన పక్షి ఎగిరిపోయిందనే సామెత లాగా.. బిడ్డలు కూడా వృద్ధాప్యంలో తోడు ఉండి సపర్యలు చేయాల్సిన సమయంలో ఆస్తి కోసం, భారమవుతారని భావించి వారిని వదిలించుకుంటున్నారు. దీంతో వృద్ధాశ్రమాల్లో కొందరు కాలం నెట్టుకొస్తుండగా.. మరికొందరు అనాథలుగా భిక్షాటన చేస్తూ దీనస్థితిలో బతుకులు ఈడుస్తున్నారు. అయిన వారినే తలుచుకుంటూ అందరూ ఉన్నా అనాథలుగా కాలం దాటేస్తున్నారు.

వృద్ధాప్యం..అనివార్య దశ..

వృద్ధాప్యం ప్రతి మనిషి జీవితంలో ఓ అనివార్య దశ. ఆ సమయంలో పిల్లలపై ఆధారపడక తప్పని పరిస్థితి. ఈ దశలో వారిని ఎంత ప్రేమగా చూసుకుంటే ఆ ప్రభావం మన పిల్లలపై అంత బలంగా పడుతుంది. మన ఆఖరి దశలో అంతకంటే బాగా చూసుకునే వీలుంటుంది. అయితే మన తల్లిదండ్రుల పట్ల మనం మెలిగే తీరే మళ్లీ మనకు మన పిల్లల నుంచి ఎదురవుతుందనేది గుర్తుంచుకోవాలి.

ఎన్నో సమస్యలతో వస్తున్నారు



కన్నబిడ్డల ఆదరణ కరువైన వారు ఆశ్రమానికి వస్తున్నారు. 23 యేళ్ల నుంచి ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం 77 మంది వృద్ధులు, దివ్యాంగులు, పూర్తిగా నడవలేని వారు ఉన్నారు. ఆశ్రమంలో ఉండి తనువు చాలించిన 55 మందికి అంత్యక్రియలు చేశాం. కొడుకులు గానీ, కుటుంబ సభ్యులు గానీ ఇంతవరకు ఆశ్రమానికి రాలేదు.

– ఫిలిప్స్, జీవనజ్యోతి ఆశ్రమ నిర్వాహకుడు

వేధిస్తే మూడు నెలలు జైలుశిక్ష, జరిమానా



సీనియర్ సిటిజన్ యాక్ట్–2007 చట్టం ప్రకారం వృద్ధులను వేధిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయి. చట్టంలోని సెక్షన్ 23 కింద పిల్లలు బలవంతంగా ఆస్తులు రాయించుకుంటే సేల్‌డీడ్ మినహా రద్దు చేసే అవకాశం ఉంది. సెక్షన్ 24 ప్రకారం నిర్లక్ష్యం చేసినా, వారిని హింసించినా, దాడి చేసినా మూడు నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా... రెండూ విధిస్తారు. సీనియర్ సిటిజన్ యాక్ట్ కింద రక్షణ, మెయింటనెన్స్ పొందవచ్చు. నిర్లక్ష్యానికి గురైన వారు నేరుగా సబ్ కలెక్టర్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్‌లో కేసు వేయవచ్చు. ఇప్పటివరకు పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌కు వృద్ధులు ఎవరూ ఫిర్యాదు చేసేందుకు రాలేదు.

– వినోద్‌కుమార్, ఆదోని డీఎస్పీ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గణేకల్‌లో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోని రూరల్ : ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గణేకల్ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామంలోని రైతుభరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం 25 మందికి పొజిషన్ పట్టాలు అందజేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి పథకాల లబ్ధిని వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్ల పాలనలో 95 శాతానికిపైగా పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఎంపీడీఓ గీతావాణి, ఈఓపీఆర్డీ జనార్దన్, ఆర్ఐ జయరామిరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ మాలిక్‌బాషా, వీఆర్వో చంద్రయ్య, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ తిప్పన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు రేణుక, సర్పంచ్ బంగారమ్మ, ఎంపీటీసీ లక్ష్మి, నాయకులు మల్లారెడ్డి, ధర్మయ్య, గిడ్డయ్య, పరమేష్, మల్లారెడ్డి, లక్ష్మయ్య, యల్లప్ప, ఉచ్చీరప్ప పాల్గొన్నారు.

విజేత రచ్చమర్రి వృషభాలు



బండలాగుతున్న ఎద్దులు

పెద్దకడబూరు : గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌ను పురస్కరించుకొని మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీల్లో మంత్రాలయం మండలం రచ్చమర్రి గ్రామానికి చెందిన పెద్దయ్య ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామానికి చెందిన రామ్‌చరణ్ ఎద్దులు రెండో స్థానంలో నిలవగా, పెద్దకడబూరు మండల కేంద్రానికి చెందిన పిల్లిగుండ్ల రాముడు ఎద్దులు మూడో స్థానంతో సరిపెట్టుకున్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.30,116, రూ.20,116, రూ.15,116 దాతల సహకారంతో అందించారు. కాగా..పోటీలను సీఎస్ఐ చర్చ్ పాస్టర్ రెవరెండ్ మనోహర్‌బాబు, ఆర్సీఎం చర్చ్ ఫాదర్ సంజీవ్‌రావు ప్రారంభించారు. దాతలు భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గుమ్మల మాధురి, గుమ్మల శాంతిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొగ్గుల మేకల రాజు, బొగ్గుల తిక్కన్న పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మైనార్టీ కాలనీలో నున్న ముస్లిం పేదమహిళలకు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ సోమవారం చీరలు పంపిణీ చేశారు. రంజాన్ పండగను పురస్కరించుకుని 60 మంది పేద మహిళలకు చీరలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పండగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

జనం గుండెల్లో జగన్

ఆదోని టౌన్: జనం గుండెల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెరగని స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా,21వ వార్డు కౌన్సిలర్ రాజేశ్వరరెడ్డి,16వ వార్డు కౌన్సిలర్ తాయన్న తెలిపారు. జగనన్నే మా భవిష్యత్‌–మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు సోమవారం పట్టణంలోని 16, 18, 19, 02, 21, 28 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి అభిప్రాయాలను సేకరిస్తూ ముందుకుసాగారు. కార్యక్రమంలో కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

➡ మంత్రాలయం రూరల్: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని మాధవరం, చెట్నేహళ్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి,వైస్ ఎంపీపీ పులకుర్తి రాఘవేంద్ర ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వినిపించారు. అలాగే మంత్రాలయంలో సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, సోమహళ్లిలో సర్పంచ్ రాధ, ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్టు బోర్డు సభ్యులు లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

➡ కోసిగి: అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి సీఎంగా చేసుకుంటే మనందరి భవిష్యత్‌ను తీర్చిదిద్దుతారని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. సోమవారం కోసిగి సచివాలయం–2 పరిధిలో గృహసారథులు,సచివాలయ కన్వీనర్ల, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ తిరిగి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం చేపట్టారు. అలాగే గృహసారథుల మండల కన్వీనర్, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్ రెడ్డి డి.బెళగల్ గ్రామంలో పర్యటించారు.

➡ పెద్దకడబూరు : పేద బడుగు బలహీన వర్గాల జీవితానికి.. జీవనోపాధికి భరోసా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కంబలదిన్నె, హనుమాపురం, కల్లుకుంట గ్రామాల్లో జగనన్నే మా భవిషత్ కార్యక్రమం సోమవారం వారు చేపట్టారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు విజయేంద్రరెడ్డి, నాయకులు రవిచంద్రరెడ్డి, పూజారి ఈరన్న, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

➡ కౌతాళం: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ ఏరిగేరి నాయకుడు మాజీ సర్పంచ్ ధర్మన్న, బాపురం నాయకుడు గురునాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఏరిగేరి గ్రామంలో జగనన్నే జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



హనుమాపురంలో జగనన్నే మా నమ్మకం స్టిక్కర్ అతికిస్తున్న దృశ్యం





ఎస్కేడీ కాలనీ జీరో రోడ్డులో పథకాలను లబ్ధిదారుడికి వివరిస్తున్న నాయకులు, కోసిగిలో మహిళ అభిప్రాయాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎల్లెల్సీకి నీటి సరఫరా బంద్

హొళగుంద:తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కి సోమవారం రాత్రి టీబీ బోర్డు అధికారులు నీటి సరఫరా నిలిపివేశారు. టీబీ డ్యాంలో నీటిమట్టం అడుగంటుతుండడంతో రాత్రి నుంచి నీటి మట్టాన్ని తగ్గిస్తూ మంగళవారం ఉదయానికి పూర్తిగా నిలిపి వేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఎల్లెల్సీలో ఆంధ్ర కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద మరో వారం రోజుల పాటు కాలువలో చిన్నగా ప్రవాహం ఉంటుందని అధికారులు తెలిపారు.447 క్యూసెక్కులు నీటి ప్రవాహముంది.

టీబీ డ్యాంలో నీటి నిల్వలు: టీబీ డ్యాంలో సోమవారం 1578.05 అడుగులతో 3.593 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఈ 11.898 టీఎంసీల నీరు నిల్వ ఉండేది.

ఉత్సవాలు ప్రారంభం



శంకరబండలో పూజలందుకుంటున్న లింగమేశ్వర స్వామి

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో సోమవారం లింగమేశ్వర స్వామి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకుపూజ, అభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దలు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని చిన్నహుల్తి గ్రామ సమీపంలో హంద్రీ–నీవా బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆస్పరి మండలం శంకరబండకు చెందిన బోయ మండగిరి వెంకటేష్ (23)తీవ్ర గాయాలపాలయ్యాడు. పని నిమిత్తం పత్తికొండకు వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తుండగా బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో వెంకటేష్ తలపగిలి, చెవి నుంచి తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



బాధితుడి సమస్యను ఆలకిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి చెందేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లరాదని, రీ సర్వేలో ఏదైనా సమస్యలు వస్తే సంవత్సరంలోపు ఆ మండలానికి సంబంధించి మొబైల్ మెజిస్ట్రేట్ లేదా రీ సర్వే ఉప తహసీల్దార్ అప్పీల్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గోవింద్‌సింగ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మున్సిపల్ మేనేజర్ విజయ్ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, సీనియర్ సహాయకులు రామయ్య పాల్గొన్నారు.

సమస్యల్లో కొన్ని..

☛ కోసిగి మండలం సజ్జలగుడ్డం గ్రామానికి చెందిన హరిజన ఎల్లప్పకు సర్వే నంబర్ 28/2ఏలో 30 సెంట్లు, 28/3ఏలో 95 సెంట్లు, మొత్తం 1.25 ఎకరాలు వారసత్వంగా సంక్రమించింది. ప్రస్తుతం వేరే వారు తమ భూమిని ఆక్రమించారని, విచారణ చేసి న్యాయం చేయాలని ఆయన అర్జీ సమర్పించారు.

☛ నందవరం మండలం చిన్నకొత్తిలి గ్రామానికి చెందిన హుసేనికి సర్వే నంబర్ 181 బీ1లో 1.75 ఎకరాల భూమి ఉంది. ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వినతి పత్రం అందజేశారు.

☛ గోనెగండ్లకు చెందిన మహ్మద్‌కు సర్వే నంబర్ 176లో 3.13ఎకరాల భూమికి సంబంధించి అడంగళ్, ఆర్ఓఆర్‌లో పేర్లు ఉన్నాయని, కానీ ఆన్‌లైన్‌లో తన పేరు నమోదు కాలేదని,నమోదు చేయాలని విన్నవించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోనిటౌన్:మున్సిపాలిటీలోని 42 వార్డుల పరిధిలో సమస్యలతో ఎవరైనా ఇబ్బంది పడుతుంటే స్పందనలో వినతి పత్రం అందజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

వాహనాల వేలం

ఆలూరు రూరల్: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఆలూరు సర్కిల్‌లోని 4 మండలాల పోలీసు స్టేషన్ల పరిధిలో ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన 85 వాహనాలను హాలహర్వి పోలీసుస్టేషన్ ఆవరణలో సీఐ ఈశ్వరయ్య సమక్షంలో వేలం నిర్వహించారు. 65 వాహనాలను వేలం దారులు దక్కించుకున్నారు.65 వాహనాలకు ప్రభుత్వంనిర్ణయించిన ధర రూ.4, 18,300 కాగా 18 శాతం జీఎస్టీతో కలిపి రూ.6,70,800 ఆదాయంవచ్చినట్లు ఆలూరు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్లు డీఎస్పీ శ్రీనివాస్ చెప్పారు.